సమస్యల్లో అంగన్‌వాడీ కేంద్రాలు



దామెరలో అంగన్‌వాడీ కేంద్రానికి అడ్డుగా నిర్మించిన రాళ్లగోడ



ల్యాదళ్లలో శిథిలావస్థకు చేరిన భవనంలో అంగన్‌వాడీ కేంద్రం

- పక్కా భవనాలు లేక ఇక్కట్లు
- స్లాబ్ వేసిన భవనాలు శిథిలావస్థకు..
- కనీస వసతులు లేకపోవడంతో గర్భిణులు, చిన్నారుల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



తక్కళ్లపహాడ్‌లో నిర్మాణ దశలో నిలిచిన అంగన్‌వాడీ కేంద్రం

దామెర : గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందిస్తూ, వారి ఆరోగ్యానికి రక్షణ నిలవాల్సిన అంగన్‌వాడీ కేంద్రాలు సమస్యల్లో చిక్కుకున్నాయి. పక్కా భవనాలు లేకపోవడంతో అద్దె భవనాలు, శిథిలావస్థకు చేరుకున్న భవనాల్లో కొనసాగిస్తూ అధికారులు, సిబ్బంది నెట్టుకొస్తున్నారు. దీంతో అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలు, మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికారం సరఫరాలో భాగంగా పప్పు దినుసులు, నూనే, స్నాక్స్, కోడిగుడ్లతో పాటు బాలామృతం ప్యాకెట్లను అందిస్తున్నారు. పౌష్టికలోపం నివారణే ధ్యేయంగా పనిచేయాల్సిన అంగన్‌వాడీ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు లేకపోవడంతో పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అద్దె భవనాల్లో నెట్టుకొస్తూ..

మండలంలో 14 గ్రామాల్లో 37 అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. కాగా ఇందులో 18 పక్కా భవనాలు ఉండగా మిగిలిన 19 కేంద్రాలు ప్రభుత్వ పాఠశాలల్లోని శిథిలావస్థకు చేరుకున్న భవనాల్లో కొనసాగగా, అద్దె భవనాల్లో మరికొన్ని కొనసాగుతున్నాయి. చిన్న పిల్లలను ఆకట్టుకునే విధంగా, ఆట వస్తువులతో పాటు ఆడుకునేందుకు విశాలమైన మైదానం కలిగి ఉండాల్సిన అంగన్‌వాడీ కేంద్రాలు ఇలా ఇరుకు గదులు, అద్దె భవనాల్లో కొనసాగుతుండడంతో చిన్నారులకు తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. బాలింతలు, గర్భిణులు నిత్యం వస్తుంటారని, మౌలిక వసతులు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వాపోతున్నారు. మండలంలోని ఒకటి, రెండు కేంద్రాల్లో మినహా అన్ని కేంద్రాల్లో కనీస వసతులు లేవనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ల్యాదళ్ల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో శిథిలావస్థకు చేరుకున్న భవనంలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయని, తక్కళ్లపహాడ్ గ్రామంలో నిర్మాణ దశలో ఉన్న అంగన్‌వాడీ భవనం ఏళ్లు గడుస్తున్నా పూర్తి కాకపోవడంతో అది నిరుపయోగంగా మారిందని స్థానికులు ఆగ్రహిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రాలకు అన్ని వసతులతో పక్కా భవనాలు నిర్మించడంతో పాటు ఆట వస్తువులను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

అడ్డుగా గోడ నిర్మాణం

మండల కేంద్రంలో గ్రామపంచాయితీ, అంగన్‌వాడీ కేంద్రం కోసం దాత ఇచ్చిన భూమిలో భవనాలు నిర్మించారు. కానీ ప్రస్తుతం తన కుమారుడు తమ స్థలంలో నిర్మించిన కార్యాలయానికి రాకూడదంటూ అడ్డుగా రాళ్ల గోడను అడ్డుగా నిర్మించాడు. దీంతో ఆ కేంద్రానికి వెళ్లే మార్గంలేక గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు పడుతున్నారు. కాగా చేసేదేమిలేక ఈ కేంద్రాన్ని అద్దె భవనంలో కొనసాగిస్తున్నారు. గోడను తొలగించి కేంద్రానికి వెళ్లే మార్గాన్ని ఏర్పాటు చేయాలని గ్రామస్తులు, పిల్లల తల్లిదండ్రులకోరుకుంటున్నారు.

భవన నిర్మాణం పూర్తి చేయాలి



తక్కళ్లపహాడ్ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణ పనులు 2016 ప్రారంభించారు. స్లాబ్ పనులు పూర్తైన అనంతరం నిర్మాణ పనులు నిపివేశారు. తొమ్మిది సంవత్సరాలు గడిచినా ఇప్పటి వరకు పనులు పూర్తిచేయక పోవడంతో నిర్మాణ దశలోనే శిథిలావస్థకు చేరేలా ఉంది. ఇప్పటికైనా అధికారులు చొరవతీసుకొని భవనాన్ని త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలి.

– లంక సురేందర్, తక్కళ్లపహాడ్

క్లుప్తంగా

సూచిక బోర్డుల ఏర్పాటు



వేలేరు : స్థానిక పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన పరిధిలు ప్రజలకు తెలిసేవిధంగా సూచిక బోర్డులను ఏర్పాటు చేసినట్లు ఎస్సై సురేశ్ బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్ సరిహద్దుల్లో స్థానిక ఎస్సై, పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన సెల్‌ఫోన్ నంబర్లతో కూడిన బోర్డులను, అలాగే పోలీస్ స్టేషన్ పరిధి, ముంగిపులను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. కానిస్టేబుల్ ఉప్పలయ్య, హోం గార్డు సంపత్ పాల్గొన్నారు.

మల్లన్నకు మొక్కులు



ఐనవోలు : ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి అద్దంకి నాగేశ్వర్‌రావు కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. సంక్రాంతి నుంచి ఉగాది వరకు జరిగే జాతర చివరి బుధవారం అవడంతో స్వామివారి గర్భాలయానికి ఎదురుగా ఒగ్గు పూజారులతో నజరు పట్నం వేసి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు సైతం అధిక సంఖ్యలో పాల్గొనడంతో ఆలయం కిక్కిరిసింది.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



వేలేరు : మండలంలోని పీచర గ్రామానికి చెందిన జి.నరేశ్ కొన్ని రోజుల క్రితం సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. దీంతో వేలేరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ యాప్ ద్వారా దర్యాప్తు చేపట్టిన పోలీసులు పోగొట్టుకున్న ఫోన్‌ను ట్రేస్ చేసి స్వాధీనం చేసుకుని బుధవారం బాధితుడికి అందించారు. ఈ సందర్భంగా నరేశ్ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపాడు.

'చంద్రనగరి'పై అవగాహన



దామెర : ప్రాచీన చంద్రనగరిపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఊరుగొండ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు ఆర్.గణపతి అన్నారు. మండలంలోని కోగిల్వాయి సమీపంలో గల చంద్రగిరి గట్టుపై కొలువైన చెన్నకేశవస్వామి ఆలయాన్ని ఇంటాక్ చాపర్ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 15వ శతాబ్దం నాటి చంద్రనగరిగా అభివర్ణించారు. రేచర్ల పద్మనాయకుల పాలనాకేంద్రంగా కోట గోడలు, దేవలయాలు, భైరవ శిలలు, సప్త గుండాలు ఈ ప్రదేశం యొక్క విశేషాలుగా పేర్కొన్నారు. గత వైభవ చిహ్నాలు, కట్టడాలను కాపాడుకుని ముందు తరాలకు వారసత్వ సంపదగా ఇవ్వాలని సూచించారు. ట్రెక్కింగ్ ద్వారా గుట్టపైకి చేరుకోవడంపై విద్యార్థులు తమ ఆనందం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు సునీత, అనితకుమారి, విజయప్రభ, వసుంధర, స్వరూపరాణి, శ్రీనివాస్, సురేందర్ 40 మంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల తనిఖీ

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం కడిపికొండలోని తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాలను హనుమకొండ జిల్లా అడిషనల్ కలెక్టర్ ఎ.వెంకట్‌రెడ్డి బుధవారం తనిఖీ చేశారు. మెనూ, విద్యపై ఆరా తీశారు. మెనూ ప్రకారం భోజనం అందజేయాలని పాఠశాల సిబ్బందికి సూచించారు.

పండుగలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

కాజీపేట: ఉగాది, రంజాన్, శ్రీరామ నవమి వేడుకలను కుల, మతాలకు అతీతంగా ప్రశాంత వాతావరణంలో ప్రజలు జరుపుకోవాలని ఏసీపీ తిరుమల్ సూచించారు. కాజీపేట పోలీస్ స్టేషన్ ఆవరణలో బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన పీస్ కమిటీ సమావేశంలో మాట్లాడుతూ సోదరాభావంతో కలిసిమెలిసి ఉండాలని అన్నారు. ఎస్సైలు శివకృష్ణ, లవన్ కుమార్, తేలు సారంగపాణి పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

50శాతం సబ్సిడీతో వ్యవసాయ పరికరాలు

శాయంపేట : వ్యసాయ యాంత్రీకరణ పథకం (సబ్ మిషన్ ఆన్ అగ్రికల్చర్ మెకనైజేషన్) ద్వారా ఈ ఆర్థిక సంవత్సరానికి గాను మండలంలోని ఎస్సీ, ఎస్టీ, జనరల్ మహిళా రైతులకు 50శాతం సబ్సిడీపై వ్యవసాయ యంత్ర పరికరాలను అందజేయనున్నట్లు ఏఈఓ గంగాజమున బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. బ్యాటరీ స్ప్రేయర్స్–5, తైవాన్ స్ప్రేయర్స్–5, రోటవేటర్స్–2, కల్టివేటర్స్–3, ఎరువులు, విత్తనాలు వేసుకునే యంత్రం–1, పవర్ వీడర్–1, బ్రష్ కట్టర్–1, బండ్ ఫార్మర్–1, వరి గడ్డి చుట్టే యంత్రం–1, డ్రోన్–1, ట్రాక్టర్–1 అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ పథకానికి ఆసక్తి కలిగిన ఎస్సీ, ఎస్టీ, జనరల్ మహిళా రైతులు దరఖాస్తుతో పాటు పట్టాదార్ పాస్‌బుక్, ఆధార్ కార్డు, కుల ధృవీకరణపత్రం, ట్రాక్టర్‌కు సంబంధించిన పరికరాలకు రిజిస్ట్రేషన్ పేపర్స్, పాస్‌ఫొటోతో ఈ నెల 29వ తేదీలోపు మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

జ్యూస్ పాయింట్లను తొలగించాలి



పరకాల : రోడ్డుకిరువైపులా వెలసిన జ్యూస్ పాయింట్‌లను తొలగించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఏకు శంకర్ మాదిగ కోరారు. ఈ మేరకు బుధవారం పరకాల మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రోడ్లను ఆక్రమించడం వలన వాహనదారులు, ఆటో కార్మికులు పార్కింగ్ ఇబ్బందులు పడుతున్నారని ఫిర్యాదు చేశారు. తక్షణమే రోడ్లను ఆక్రమించికుని ఉన్న జ్యూస్ పాయింట్‌లను తొలగించాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కమలాపూర్ : అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. అక్రమంగా ఇసుక తరలింపునకు పాల్పడుతున్నారనే సమాచారం మేరకు మండలంలోని ఉప్పల్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా జమ్మికుంట మండలం విలాసాగర్‌కు చెందిన అంబాల రమేశ్ పట్టుబడినట్లు తెలిపారు. అతని వద్ద అనుమతి పత్రం లేకపోవడంతో ఇసుక ట్రాక్టర్ సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్ గ్రామకమిటీ ఎన్నిక



శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక గ్రామంలో బుధవారం మాజీ ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సవాసి రమేశ్, ఉపాధ్యక్షుడిగా పైండ్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా దాసరి రవి, కోశాధికారిగా పైండ్ల ఐలయ్య, కార్యదర్శి వేములపల్లి కుమారస్వామి, యూత్ అధ్యక్షుడిగా కోగిల రవికిరణ్, ఉపాధ్యక్షుడిగా పైండ్ల భానుచందర్, ప్రధాన కార్యదర్శిగా నాగెళ్లి సురేశ్‌ను ఎన్నుకున్నారు. ఈ మేరకు నియామకపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రామకృష్ణకు ఎమ్మెల్సీ ఇవ్వాలి

ఆత్మకూరు : కాంగ్రెస్ పార్టీకి అనేక సంవత్సరాలుగా సేవలందిస్తున్న పెరుమాండ్ల రామకృష్ణకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సురేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకుడు రామకృష్ణ గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రజలకు అనేక సంవత్సరాలుగా వైద్య సేవలు అందిస్తున్నారని, ఆయనకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చి న్యాయం చేయాలని అన్నారు. నాయకులు రాజు, నవీన్, లక్ష్మణ్, శ్రీకాంత్, అనిల్, సిద్ధార్థ, కౌశిక్ పాల్గొన్నారు.

పరామర్శ



ఐనవోలు : మండలంలోని పంథిని గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ బోయినపల్లి సోమేశ్వర్‌రావు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన విషయం తెలిసిందే. కాగా బుధవారం పదో రోజు కార్యక్రమం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, సీనియర్ నాయకుడు వరద రాజేశ్వర్‌రావు హాజరై మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదే విధంగా టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, కేంద్ర ఖాదీ చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం, ఇతర కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమేశ్వర్‌రావు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అవయవ దానానికి అంగీకారం



ఎంజీఎం : ఉమ్మడి వరంగల్‌లోని విశ్రాంత ఉద్యోగులు, గృహిణులు, యువత, మహిళలు, ఇతర వృత్తులకు చెందిన 74 మంది సమాజ హితం కోరి తమ మరణాంతరం పార్థివ దేహాలను వైద్య విద్య నిమిత్తం వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాలకు దానం చేస్తామని హామీ ఇచ్చారు. ఈమేరకు వారు అందజేసిన విల్ ఫారమ్స్ (అంగీకార పత్రాల)ను తెలంగాణ నేత్ర, అవయవ శరీర, దాతల అసోసియేషన్ ఆధ్వర్యంలో కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాంకుమార్‌రెడ్డికి బుధవారం అందజేశారు. అనంతరం ఆయన నుంచి బాడీ డొనేషన్ విల్ సర్టిఫికెట్లను అసోసియేషన్ ప్రతినిధులు అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాంకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఒక పార్థివ దేహం వందల మంది వైద్యులకు వైద్య పాఠం చెబుతుందని అన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉపేందర్ రెడ్డి, వరంగల్, హనుమకొండ జిల్లాల అధ్యక్షులు కె.మల్లారెడ్డి, పి.వేణు, ప్రధాన కార్యదర్శి రాజేంద్ర ప్రసాద్, సహాయ ఉపాధ్యక్షురాలు పద్మ, అనాటమీ సిబ్బంది ప్రేమ్‌కుమార్, యాదగిరి పాల్గొన్నారు.

పారిశ్రామిక రంగాల్లో స్థిరపడాలి

మామునూరు: యువతే రాబోయే కాలనీకి శక్తి కేంద్రమని, దేశాభివృద్ధి మార్పు యువతతోనే సాధ్యమని, ఈ క్రమంలో పారిశ్రామిక రంగాలపై దృష్టి సారించాలని బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ హైదరాబాద్ గరేత్ వైన్నా ఓవెన్, లోక్ సత్తా వ్యవస్థాపకుడు, మాజీ ఐఏఎస్ అధికారి డాక్టర్ జయప్రకాశ్ నారాయణ, భారత ప్రభుత్వ డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ చైర్మన్ డాక్టర్ శ్రీరామనాన్ రామనాథన్ అన్నారు. ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో సంవిన్, విభ సంయుక్త ఆధ్వర్యంలో ఇ–సమ్మిట్ 6.0 కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ యువత, మహిళలను వ్యాపార వేత్తలుగా, స్వయం సంస్థ వ్యవస్థాపకులుగా మార్చేందుకు భారత ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో జేఏ.చౌదరి, వాగ్దేవి విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ దేవేందర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ వాహినిదేవి, సీఈఓ సలీం జివాని, సంవిన్, సాయికిరణ్, విద్యార్థులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే లక్ష్యం



నయీంనగర్: జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం టీయూడబ్ల్యూజే (ఐజేయూ) తరఫున పోరాటం కొనసాగిస్తామని ఐజేయూ జాతీయ నాయకుడు దాసరి కృష్ణారెడ్డి అన్నారు. గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గడ్డం రాజిరెడ్డి అధ్యక్షతన జిల్లా యూనియన్ నూతన సభ్యత్వాల నమోదు కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో వరంగల్ నగరంతో పాటు మండల కేంద్రాల్లోని జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు, ఇళ్లు సాధించేందుకు పోరాడుతామని పేర్కొన్నారు. రాష్ట్ర హౌసింగ్ వెల్ఫేర్ కన్వీనర్ వల్లాల వెంకటరమణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మధు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సంతోశ్, వేణుమాధవ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, పురుషోత్తం, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి సదయ్య, బుచ్చిరెడ్డి, నయీం, విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్‌తో ఉద్యోగ అవకాశాలు



ఖిలా వరంగల్: విద్యార్థులు చదువుతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకుంటే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని తాళ్ల పద్మావతి విద్యాసంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం, కళాశాల డైరెక్టర్ డాక్టర్ తాళ్ల వరుణ్ సూచించారు. ఈమేరకు వరంగల్ బైపాస్ రోడ్డు ఉర్సు గుట్ట సమీపంలోని తాళ్ల పద్మావతి ఫార్మసీ కళాశాలలో మెడ్‌ప్లస్ సంస్థ ప్రతినిధులు ఆధ్వర్యంలో డాక్టర్ వెంకటేశ్వర్‌రావు అధ్యక్షతన విద్యార్థులకు క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను బుధవారం నిర్వహించారు. 125 మంది విద్యార్థులకు గాను 55 మంది ఉద్యోగాలు సాధించడం అభినందనీయమని వారు కొనియాడారు. అధ్యాపకులు డాక్టర్ బేతి శ్రీనివాస్, డాక్టర్ పుష్పి, డాక్టర్ రమ్యకృష్ణ, డాక్టర్ మాధవి పాల్గొన్నారు.

రైతుల బలోపేతానికి సహకార సంఘం కృషి

- చైర్మన్ సంపత్‌రావు



మాట్లాడుతున్న చైర్మన్ సంపత్‌రావు

కమలాపూర్ : రైతులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు సహకారం సంఘం కృషి చేస్తోందని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ పేరాల సంపత్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం 65వ వార్షిక, 84వ సర్వసభ్య సమావేశం బుధవారం సంఘంలోని గోదాంలో జరిగింది. ఈ సందర్భంగా సంఘం వార్షిక నివేదికను కార్యదర్శి ఎండి.చోటే మియా చదివి వినిపించగా సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. గత సీజన్ మాదిరిగా మండల వ్యాప్తంగా 16 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కొనుగోళ్లు చేపట్టాలని, పీఏసీఎస్ ఆధ్వర్యంలో సంఘం స్థలంలో 500 కిలోవాట్స్ సోలార్ ప్లాంట్ నెలకొల్పాలని తీర్మాణించినట్లు తెలిపారు. 2025–26 సంవత్సరానికి గాను అంచనా బడ్జెట్ ఆమోదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు సహకార సంఘం అన్ని విధాలుగా సహకరిస్తోందని, ప్రభుత్వ నుంచి వచ్చే సబ్సిడీ ఫలాలను అందిస్తుందన్నారు. రుణాల మంజూరు విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఎర్రం ఇంద్రసేనారెడ్డి, డైరెక్టర్లు తక్కళ్లపల్లి సత్యనారాయణరావు, రాజేశ్వర్‌రావు, యాదగిరి, శ్రీనివాస్, ఎడ్వర్డ్, సంఘ సిబ్బంది, సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

కార్యదర్శులను సర్వే నుంచి మినహాయించాలి

- ఫోరం జిల్లా కార్యదర్శి నరేశ్



ఎంపీడీఓకు వినతిపత్రం సమర్పిస్తున్న కార్యదర్శులు

దామెర : ప్రభుత్వం చేపట్టిన రేషన్ కార్డుల ఇంటింటి సర్వే నుంచి గ్రామపంచాయతీ కార్యదర్శులను మినహాయించాలని గ్రామపంచాయతీ కార్యదర్శుల ఫోరం జిల్లా కార్యదర్శి ఇంజపల్లి నరేశ్ కోరారు. ఈ మేరకు బుధవారం పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీఓ కల్పనకు వినతపత్రం అందించారు. ఈ సందర్భంగా నరేశ్ మాట్లాడుతూ.. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో తాగునీటి సరఫరా, ఎల్ఆర్ఎస్ సర్వే, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గుర్తింపు సర్వే, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఇంటి పన్ను 100 శాతం వసూలు, ఉపాధి హామీ పనుల నిర్వహణ, ఇతర ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనడం వంటి పనుల్లో పంచాయతీ కార్యదర్శులు నిమగ్నమై ఉన్నారని అన్నారు. ఉప్పటికే పని ఒత్తిడితో విధులు నిర్వహిస్తున్న తమకు అదనపు భారం మోపడం సరికాదని అన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి మినహాయింపు కల్పించాలని ఎంపీడీఓను కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రెటరీ శివశంకర్, పరకాల డివిజన్ అధ్యక్షుడు వేణుమాధవ్, కార్యదర్శులు సరళ, కవిత తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని గాలికొదిలేసిన ప్రభుత్వం



నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

శాయంపేట : విద్యారంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం గాలికొదిలేసిందని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ మండిపడ్డారు. మండల కేంద్రంలో బుధవారం ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నప్పటికీ విద్యారంగా సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి పట్టించుకోవడం లేదన్నారు. విద్య రంగానికి ప్రభుత్వం బడ్జెట్‌లో అతి తక్కువ నిధులు కేటాయించిందని ఆరోపించారు. విద్యాశాఖకు వెంటనే మంత్రిని కేటాయించి, ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌళిక సదుపాయాలు కల్పించాలని కోరారు. రాష్ట్రంలో రూ.7,200కోట్ల స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టనున్నట్లు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు ఇస్మాయిల్, నాయకులు సాయికుమార్, అఖిల్, కన్నారావు, సన్ని, శశాంక్, అజయ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నిరంకుశ పాలనను వ్యతిరేకించాలి

- కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్



మాట్లాడుతున్న శ్రీనివాస్

పరకాల : దేశంలో బీజేపీ నిరంకుశ పాలనను కొనసాగిస్తోందని, ప్రతిఒక్కరూ వ్యతిరేకించాల్సిన సమయం వచ్చిందని కాంగ్రెస్ పార్టీ పరకాల పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఏఐసీసీ, టీపీసీసీ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన జైబాపు, జై భీం, జై సంవిధన్ కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ పరకాల పట్టణ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కొన్ని రాజకీయ శక్తులు సమాజానికి విరుద్ధంగా వ్యవహరిస్తూ ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అదిష్టానం పిలుపు మేరకు పట్టణంలో వాడవాడకు పాదయాత్ర చేపట్టి బీజేపీ ప్రజావ్యతిరేక పాలనపై ప్రజలను చైతన్య పరుస్తున్నట్లు చెప్పారు. బీజేపీ దుర్మార్గపు పాలన నుంచి భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవసాయ మార్కెట్ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, సమన్వయ కమిటీ సభ్యులు సోదా రామకృష్ణ, చిన్నాల గోనాథ్, మాజీ ఎంపీపీ ఓంటేరు రాంమూర్తి, బుర్ర రాజమౌళి, పొరండ్ల సంతోశ్, రంజాన్‌అలీ, మార్క రఘుపతి, మడికొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఒకే దేశం- ఒకే ఎన్నికతో దేశానికి మేలు

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

శాయంపేట : ఒకే దేశం- ఒకే ఎన్నిక విధానంతో దేశ ప్రజలకు మేలు జరుగుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చదువు రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని హుస్సేన్‌పల్లి గ్రామంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ అధ్యక్షతన ఒకే దేశం, ఒకే ఎన్నిక అంశంపై వర్క్ షాప్ నిర్వహించగా ఆయన హాజరై మాట్లాడారు. లోక్‌సభ, అసెంబ్లీ, స్థానిక సంస్థల ఎన్నికలను ఒకేసారి నిర్వహించడం వలన ఎన్నికల ఖర్చును తగ్గించడం, పరిపాలన సామర్థ్యం పెరుగుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను సమన్వయించుకునే అవకాశం ఉందని, ప్రతి ఓటరు ఎన్నికల్లో ఓటు వేస్తే ప్రజాస్వామ్యం మెరుగుపడుతుందని అన్నారు. ఆర్థికవృద్ధి, స్థిరమైన పాలనతో పెట్టుబడులను ఆకర్షిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల్లో కూలీలను పెంచాలి

- ఎంపీడీఓ కల్పన



కూలీల వివరాలు పరిశీలిస్తున్న ఎంపీడీఓ కల్పన

దామెర : ఉపాధి హామీ పనులకు కూలీలు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఎంపీడీఓ గుమ్మడి కల్పన సూచించారు. మండలంలోని ఒగ్లాపూర్‌లో ఉపాధి హామీ పనులను బుధవారం ఆమె పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో 100 మంది కూలీలు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని క్షేత్రస్థాయి సిబ్బందికి సూచించారు. ప్రతి గ్రామంలో 50 మంది కుటుంబాలకు 100 రోజుల పని కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అనంతరం నర్సరీని పరిశీలించి మొక్కలను పెంచాలని సూచించారు. ఆమె వెంట ఏపీఓ శారద, కార్యదర్శి నరేశ్, ఫీల్డ్ అసిస్టెంట్ శంకర్, ఉపాధి కూలీలు ఉన్నారు.